

# డియర్ ఫా...

అమెరికా నించి శైలేంద్ర వస్తున్నాడన్న ఉత్సాహం రాఘవయ్యని ఒక పట్టాన నిలువనీయటం లేదు.

ఉదయాన్నే లేచి భార్య సులోచన ఫోటోముందు నిల్చొని "సునా... చూసావా? నీ కొడుకు ఎంత ఎదిగిపోయాడో.... వాడిప్పుడు అమెరికాలో గొప్ప

ఇంజనీర్. వాడు ఇంజనీర్ అవడానికి మాత్రం కష్టపడింది నేనే. ఎల్.కె.జిలోనే వాణ్ణి గుంటూరు తీసికెళ్లి సంవత్సరానికి ఇరవై అయిదువేల రూపాయల ఖర్చుతో హాస్టల్లో వేసి... వాణ్ణి ఎంత గొప్పవాన్ని చేసాను. నువ్వేమో వాడు చదువుసంధ్యల పేరుతో పూర్తి దూరమవుతున్నాడు. వాణ్ణి మన దగ్గరే ఉంచుకొని చదివిద్దామండీ అనేదానివి. వాడు మనదగ్గరే వుంటే ఇంతటి వాడయ్యేవాడా? అటుపల్లెగా, ఇటు పట్నంగా కాకుండా ఎదిగిన మనూర్లో ఏం చదువులున్నాయని వాదించేవాన్ని. నిజానికి... వీడి తోటివాళ్లంతా ఇప్పటికీ అవారాగాళ్లయి రోడ్లంట తిరుగుతున్నారు. వాళ్ల తండ్రులు నావైపు జెలసీగా చూస్తూ... మీవాడు నెలకి మూడులక్షల వరకూ సంపాయిస్తున్నాట్ట కదా రాఘవయ్య గారూ... అంటుంటే ఎంత పొంగిపోతున్నానో తెల్సా? నా బాధంతా ఒక్కటే... అంత ఉన్నతంగా ఎదిగినవాణ్ణి నువ్వు కళ్ళారా చూడలేకపోయావ్. వాడీరోజు అమెరికా నించి వస్తున్నాడు. నన్నూ.... నీ ఫోటోని అమెరికా తీసికెళ్తానని వస్తున్నాడు. సులోచనా.... నాకు ఈ వయసులో డాన్స్ చేయాలన్పిస్తుంది. రేపో మాపో అమెరికా వెళ్లాలి గదా... అందరికీ వీడ్కోలు చెప్పి వస్తాను..." అని ఫోటోకి చెప్పి బయల్దేరాడు.

వరండాలోకి రాగానే వాలుకుర్చీ కన్పించింది.

'ఇన్నాళ్లు నాకు విశ్రాంతి నిచ్చిన నిన్ను అమెరికా తీసికెళ్లటం సాధ్యపడటంలేదు' అని ప్రేమగా, బాధగా దాన్ని నిమిరాడు... చేతికర్రని తీసికుంటూ 'అమెరికాలో అన్ని స్టీలు కర్రలుంటాయేమో... శైలేంద్ర నిన్ను వద్దంటే ఇక్కడే వుండిపో....' అనుకొని కళ్లలో తడిపేరుకు పోతుంటే దాన్ని ముద్దెట్టుకున్నాడు.

పంచెను భుజాన వేసుకోబోతు... 'అమెరికాలో నిన్ను భుజం మీద

వేస్కుంటే నన్ను వింతగా చూస్తారేమో కదూ... ఇంకా ఈ ముతక పంచెలేమిటి? అని కోడలు, మనవలు గేలి చేస్తుంటే నువ్వు భరించలేవు కదూ... నాకు ఇన్నాళ్లూ రాజసాన్ని తెచ్చిపెట్టిన నీకు కన్నీళ్ళతోనే కృతజ్ఞతలు....' అనుకుంటూ జాలువారిన కన్నీటిని అదే పంచెతో తుడుచుకొని, భుజం మీద వేసుకొని చెప్పులు తొడుక్కొని బయల్దేరాడు.

సందు మలుపులో కన్పించిన షావుకారు రాజయ్యతో గర్వంగా చెప్పాడు. "రాజయ్యా... అమెరికా వెళ్లిపోతున్నాను. ఇంకెప్పుడొస్తానో ఏమిటో.... పొలాన్నీ ఇంటిని కూడా అమ్మేసాను..." అన్నాడు. చివరిమాట అంటున్నప్పుడు కళ్లలోంచి నీళ్లు జలజలా రాలాయి.

"అదృష్టవంతుడివి రాఘవయ్యా... పొలాన్నీ ఇంటిని తిండికి లేక అమ్మటంలేదు కదా! నువ్వే ఇక్కడ వుండనప్పుడు ఇంకా అవెందుకు? నీ కొడుకు సరైన నిర్ణయమే తీసుకున్నాడు.. అమెరికా వెళ్లాక మా అందర్నీ మర్చిపోకే..." అన్నాడు రాజయ్య. "లేదు రాజయ్యా... అప్పుడప్పుడూ ఫోన్లు చేస్తుంటా... ఇంకా వెంకటయ్యనీ, సుధాకర్ పంతుల్నీ, జోసెఫ్‌నీ, కాంతయ్యనీ, రసూల్‌భాయ్‌ని కలిసొస్తాను" అన్నాడు.

"ఇంతకీ పొలాన్నీ, ఇంటినీ ఎంతకి అమ్మేసారు?" అనడిగాడు రాజయ్య

"పొలాన్ని లక్ష రూపాయలకీ, ఇంటినీ ఎనభైవేలకి అమ్మేసాను... అడ్వాన్స్‌గా అరవైవేలిచ్చారు. మన లక్ష్మీనర్సయ్యే కొన్నాడు" అని చెప్పాడు.

"నేనిలా అంటున్నానని అనుకోవద్దుగాని... పొలం అమ్మినా, ఇల్లు అమ్మాల్సింది కాదేమో రాఘవయ్యా...."

"మా శైలేంద్రకిష్టం లేదు రాజయ్యా... అయినా నేను వుండనప్పుడు ఆ ఇల్లు మాత్రం ఎందుకు?" అని ముందుకు నడిచాడు.

నాలుగైదు గంటలు ఊరంతా తిరిగి... ఆనందంగా అమెరికా వెళ్తున్నానని అందరికీ చెప్పి వీడ్కోలు తీసుకొని వచ్చాడు. ఓమారు పొలంవైపు వెళ్లి ఆ నేలని సుతారంగా తడిమాడు.

కళ్లలోని నీళ్లు వానచుక్కల్లా పడి ఇంకిపోయాయి.

పిడికెడు మట్టి తీసుకొని ఆప్యాయంగా జేబులో పోసుకున్నాడు.

ఆ తర్వాత ఇంటికొచ్చి....

ఇంట్లోని ప్రతి జ్ఞాపకాన్ని నెమరువేసుకున్నాడు.

ఇంట్లో అటకమీద పాతబడిన ఉయ్యాల బూజుపట్టి కన్పించింది. శైలేంద్రకోసం చేయించింది. వాడోసారి దాంట్లోంచి కిందబడితే సులోచన చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. వాడు గుక్కపెట్టి ఏడ్చి, శ్వాస తీయటం ఆపేసి, గుడ్లు తేలేసాడు. అప్పుడు వాడి చెవులుమూసి, నోట్లో నోరుపెట్టి వూది ఛాతిమీద రాసి తానెంత గాబరా పడ్డాడు.

అలాంటివాడు ఈరోజు అమెరికాలో పెద్ద ఇంజనీర్.

వాణ్ణి ఇంజనీర్ చేసి అమెరికా పంపాలని తాను కన్నకలలు అన్నీ ఇన్నికావు. పదేళ్ళ వయసునించే అదే పదం ఒక మంత్రంలా చెప్పేవాడు. ఓసారి పొలంకి వున్న మోటార్‌లో నీళ్లు పోసి 'నేను ఇంజన్‌లో నీరుపోసాను ఇప్పుడింకా ఇంజనీర్‌నేనా? అని అడిగితే తానెంత నవ్వాడు. డబ్బుకోసం పంట ఎక్కువ

పండించడానికి ప్రయత్నించేవాడు.

నాలుగో ఏటనించి ఇరవై అయిదేళ్లు వచ్చేవరకు వాణ్ణి హాస్టల్‌లోనే వుంచి చదివించడానికి తానెన్ని కష్టాలు పడ్డాడు....?

ఆ కష్టాలన్నీ ఈ ఆనందం ముందు దూదిపింజలై ఎగిరిపోతున్నాయి. వాడు అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడుతుంటే మంత్రముగ్ధుడై వినేవాడు. గొప్పింటి సంబంధం వచ్చినప్పుడు మురిసిపోయి పెళ్లి చేసాడు.

తన జీవితాశయం నెరవేరటంతో... ఉక్కిరిబిక్కిరవుతున్నాడు.

పదిహేన్రోజుల క్రితం శైలేంద్ర ఫోన్ చేసి "ఫా... నిన్ను ఆ పల్లెటూర్లో ఇంకా ఎవరు చూసుకుంటారు? రేపేదైనా జబ్బు చేసినా, వృద్ధాప్యంలో పడి ఏవైనా దెబ్బలు తగిలినా ఆ ఇంట్లో నిన్ను చూసుకునే వాళ్లెవరున్నారు? ఈ వయసులో నీకు అన్నీ సమకూర్చి నిన్ను బాగా చూసుకోవటం అవసరం. అది నా బాధ్యత కూడా! అందుకే ఇల్లు, పొలం అమ్మేసెయ్... నేను ఈ నెల ఇరవైరెండున వస్తున్నాను. నువ్వు నావెంట వస్తున్నావు. దట్సాల్... అని చెప్పాడు.

రాఘవయ్యకి నోటిమాట రాలేదు....

అయినా "వద్దురా.... ఉన్నవూర్లో ఇంటినీ, పొలాన్నీ అమ్మి నీవెంట రావాలి అంటే.... కొంచెం బాధగా వుంది. ఇక్కడ నా కష్టాలేవో నేను పడతాన్లే..." అన్నాడు.

"వద్దు ఫా.... నామాటవిను.... ఈ వయసు నువ్వు కష్టపడే వయసు కాదు... ఆ పల్లెలో రేపేదైనా జరిగితే చెట్టంత కొడుకు లక్షలు సంపాదిస్తున్నా ఏం లాభం? అని నన్ను ఆడిపోసుకుంటారు. ఫా.... నీకు అన్ని సమకూర్చి ఏలోటు

లేకుండా నిన్ను చూసుకోవటం ఆ పల్లెలో ఎవరికి సాధ్యం? అందుకే నావెంట వస్తున్నావ్.... ప్లీజ్ ఫా.... మరేం చెప్పొద్దు..." అని ఫోన్ పెట్టేసాడు.

రాఘవయ్యకి ఓవైపు ఆనందం మరోవైపు ఉన్నవూరిని విడిచిపెట్టాల్సి వస్తున్నందుకు బాధా కలగలిపి వచ్చాయి. ఈ మాటల్ని ఎవరితో పంచుకోవాలో తెలీక... సులోచన ఫోటో ముందుకెళ్లి చెప్పుకొన్నాడు.

కొడుకు ఫోనొచ్చినప్పుడల్లా తానెంత వాడయ్యాడో తెలిసి విలవిలలాడేవాడు....

రెక్కలు కట్టుకొని ఈ క్షణాన్నే అమెరికాలో వాలిపోవాలని ఆతృత పడేవాడు.... మడత కుర్చీలో కూచొని ఆకాశంలో ఎగిరిపోతున్న విమానంవైపు

ఆశగా....

ఆతృతగా....

ఆవేదనగా....

ఆసక్తిగా....

కథా నిలయం 4962 శ్రీకాకుళం

కళ్లు చిట్లించి చూసేవాడు. ఏనాడైనా కొంచెం కిందుగా ఎగురుతూపోయే విమాన శబ్దం విన్పిస్తే... శైలేంద్ర ఇంటిముందు దిగుతున్నంతగా మనసు పులకించిపోయేది.

తన జీవితంలో విమానం ఎక్కుతానని ఏనాడూ వూహించనిది నిజమవుతున్నందుకు ఆశ్చర్యపోయేవాడు...

ఎప్పుడో.... చాలా ఏళ్లకిందట సులోచననీ, ఆరేళ్లున్న శైలేంద్రని బేగంపేట విమానాశ్రయం చూపించడానికి తీసికెళ్లినట్టు గుర్తు.... భూమిని దద్దరిల్లజేస్తూ వచ్చిన విమానాన్ని చూస్తూ కేరింతలు కొడుతున్న శైలేంద్రకి విమానయానం ఎంతగొప్పదో.... తాను బాగా చదివి అమెరికా ఎలా వెళ్లాలో రెండుగంటలు చెప్పినట్టు గుర్తు....

హైదరాబాద్, గుంటూరు, ఒంగోలు, విజయవాడల్లో వాడి హాస్టల్ చదువంతా గడిచిపోతుంటే... ఏడాదిలో ఎప్పుడైనా హోమ్‌సిక్ హాలిడేస్‌కి ఇంటికొచ్చే పదిరోజుల్లోనూ అమెరికా గురించి కథలు కథలుగా చెప్పేవాడు.

అవన్నీ ఫలించి.... ఈ రోజు తనని కూడా అమెరికా తీసికెళ్తున్నాడు. రాఘవయ్యని తేనెతుట్టెలా ఆలోచనలు ముసురుకొని కొడుకొచ్చే రోజుకోసం భారంగా గడిచాయి.

ఆ రోజు రానే వచ్చింది....

ఇంటిముందాగిన కార్లోంచి శైలేంద్ర దర్జాగా దిగి, దర్పంగా అడుగులేసుకుంటూ వస్తుంటే.... రాఘవయ్య నిలువెల్లా పులకించిపోయాడు.

శైలేంద్ర వస్తూనే 'హాయ్ ఫా....' అని తండ్రి పాదాలకు మొక్కాడు. తర్వాత తండ్రిని గట్టిగా కావలించుకున్నాడు. తండ్రి ఫ్రెండ్స్ కోసం రకరకాల 'గిఫ్ట్'లు తీసుకొచ్చి ఇచ్చాడు.

వాడలోని వాళ్లందర్నీ పేరుపేరునా పలకరించాడు. ఊరంతా రాఘవయ్య అదృష్టాన్నీ, కృషినీ పొగుడుతుంటే... ఇల్లంతా సందడిగా మారింది.

నాలుగైదు గంటల తర్వాత....

సులోచన ఫోటో తీసుకొని... తన లగేజి  సర్దుకొని, కొడుకుతోపాటు రాఘవయ్య కారెక్కాడు.

కళ్లనీళ్లతో ఇంటిని తనివితీరా చూస్కున్నాడు. అందరితోనూ చేతులు కలుపుతుంటే... కారు కదిలింది.

రాఘవయ్య ఇంట్లోకి ఒంటరితనం అడుగుపెట్టింది.

***　　****　　****

కారు హైదరాబాద్ సిటీ చేరింది....

చాలా కిందినించి విమానం బరబరలాడే శబ్దం చేస్తూ వెళ్తోంది. రాఘవయ్య కొడుకువైపు గర్వంగా చూస్తూ...

"శైలూ... విమానంలో టాయిలెట్స్ వుంటాయిరా?" అనడిగాడు.

శైలేంద్ర నవ్వి 'వుంటాయ్ ఫా...." అన్నాడు.

"మరి అమెరికాలో నాకు వాలుకుర్చీ, చేతికర్ర దొరుకుతాయా" అన్నాడు. శైలేంద్ర తండ్రివైపు విస్మయంగా చూసి అన్నాడు.

"నువ్వు వచ్చేది అమెరికా కాదు ఫా.... ఇక్కడి వరకే... హైద్రాబాద్‌కి...."

ఆమాట విని రాఘవయ్య హతాశుడయ్యాడు. పైన వెళ్తున్న విమానం రెండుముక్కలై... భయంకరంగా తనమీదే కూలుతున్నట్టు అన్పించింది.

"ఏంట్రా నువ్వనేది?" అన్నాడు షాకింగ్‌గా..

"అవును ఫా... ఇక్కడికే.... నేను నిన్ను అమెరికా తీసికెళ్తానని ఎప్పుడూ అన్లేదే... అయినా అక్కడికొచ్చి నువ్వేం చేస్తావ్? నీ కోడలికి కూడా ఈమధ్యే జాబ్ వచ్చింది. నేనూ రమ్య ఆఫీస్‌లకీ, పిల్లలు స్కూల్స్‌కి వెళ్తే అక్కడ కూడా ఇంట్లో ఒంటరిగా ఎలావుంటావ్?" నిన్నెవరు చూస్కుంటారు?" అన్నాడు.

"మరిప్పుడు.... ఎక్కడికిరా.... వెళ్లేది?" గొంతు తడారిపోతుంటే.... మాటలు భారంగా పెగుల్చుకొని అడిగాడు.

అప్పుడే కారాగింది. రాఘవయ్య కారు కిటికీలోంచి... ఆ భవనం ముందరి బోర్డుని చూసి స్థాణువయ్యాడు. కళ్లల్లో గండిపడ్డట్టు నీటి చెలిమలు కప్పేసాయి.

మసక మసగ్గా చదివాడు.

"సుశృత ఓల్డ్ ఏజ్ హోమ్"

శైలేంద్ర అప్పటికే కారు దిగి డోర్ తీసాడు. ఒక వర్కర్ వచ్చి లగేజీ తీసికెళ్లాడు. రాఘవయ్య శిలావిగ్రహమై నడిచాడు కొడుకువెంట... అడుగులు తడబడుతుంటే.... ఓల్డ్ ఏజ్ హోమ్ మేనేజర్ ఎదురొచ్చాడు వినయంగా.

నిశ్శబ్ద శోకవనంలా వుందది...

అక్కడక్కడా ఆడా మగా వృద్ధులు... రాఘవయ్య వైపు జాలిగా బేలగా చూసారు. మేనేజర్ ఓ గదిలోకి వాళ్లని తీసికెళ్లి... బెడ్‌ని చూపించాడు.

"డియర్ ఫా... ఇక్కడ అన్ని వసతులూ వుంటాయి. నిన్ను అనుక్షణం

కంటికి రెప్పల్లా వీళ్లే చూస్కుంటారు. ఆ పల్లెలో నిన్నెవరు చూస్కుంటారు? ఇక్కడైతే టూత్‌బ్రష్ మీద పేస్ట్ పెట్టివ్వటం దగ్గర్నించీ, రాత్రిపూట మస్కిటోకాయిల్ పెట్టడం వరకూ అన్నీ వీళ్లే చూస్కుంటారు. మంచి ఫుడ్ ఇస్తారు. మార్నింగ్ టిఫిన్, మధ్యాహ్నం లంచ్, రాత్రి పళ్లు.... వారినికోసారి డాక్టర్ చెకప్... అన్నీ... అన్నీ వుంటాయి. రామా క్రిష్ణా అనుకుంటూ హాయిగా వుండొచ్చు ఫా..." శైలేంద్ర ఓ గైడ్‌లా ఏ అనుభూతి లేకుండా చెప్పుకుంటూనే వెళ్తున్నాడు.

రాఘవయ్యకి చెవులు వినపడటం మానేసాయి.

"నెలకి త్రీ థౌజండ్ రూపీస్ పే చెయ్యాలి ఫా... ఇంటినీ, పొలంనీ అమ్మిన డబ్బుని బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ చేసాను. దాని ఇంట్రస్టుతో ఇక్కడ నీకు అన్ని సౌకర్యాలు దొరుకుతాయి. ఆ పల్లెలో నువ్వెప్పుడు ఎలా వున్నావో అనే టెన్షన్ నాకింకా అసలే వుండదు..."

జవసత్వాలు ఉడిగిపోతుంటే.... బెడ్‌మీద కూలబడ్డాడు. శైలేంద్ర కాగితాలన్నీ పూర్తి చేసి హడావిడిగా.... "ఫా... ఈ రాత్రి ఎనిమిదింటికి నాకు ఫ్లయిట్ వుంది. నేను అప్పుడప్పుడు ఫోన్ చేస్తుంటాను.... ఒకే ఫా... లీవ్‌మీ... " అన్నాడు.

వెళ్లిపోబోతున్న కొడుకు చెయ్యిని గబుక్కున అందుకున్నాడు రాఘవయ్య. ఆ తండ్రి ఒంటినిండా చెమటలు... కళ్లనిండా కన్నీళ్లు.... "శైలూ... నాకిక్కడ భయంగా వుందిరా... మనూరు వెళ్లిపోతాను..." అన్నాడు బేలగా. శైలేంద్ర మౌనంగా చేతిని విడిపించుకున్నాడు. వాచీ చూసుకొని వడివడిగా వెళ్లిపోయాడు.

రాఘవయ్య గుండె కన్నీటి పుట్టయింది. దుఃఖం జలపాతమై

కదిలిపోతుంటే కుంగిపోయి కూచున్నాడు.

అప్పుడే రాఘవయ్య భుజంమీద చేయిపడితే ఉలిక్కిపడ్డాడు. అతడు అదే గదిలో వుండే మరో వృద్ధుడు.

"హలో... నాపేరు రామలింగేశ్వరయ్య. రిటైర్డ్ ఐ.ఎ.ఎస్.... ఇప్పుడు నువ్వు కొడుకుతో ఏమన్నావ్? నాకిక్కడ భయంగా వుందిరా... మనూరు వెళ్లిపోదాం... అని కదూ.. మనం పిచ్చి తండ్రులమయ్యా.... ఇదేమాట వాడూ అనుంటాడు... గుర్తు తెచ్చుకో... కొడుకు ప్రయోజకుడు కావాలని ఐదారేళ్ల వయసులోనే ఏ గుంటూరు హాస్టల్లోనో, హైద్రాబాద్ హాస్టల్లోనో, విజయవాడ హాస్టల్లోనో వాన్ని జాయిన్ చేసినప్పుడూ... భయం భయంగా ఆ పసివాడు ఇదేమాట అని వుంటాడు.... ఆరోజే మనం ఇంటికి తీసికొని వచ్చి వుంటే మనమిప్పుడు ఇంట్లోనే వుండేవాళ్లం... మనమెవరం గ్రహించటం లేదు. వాళ్లు ప్రయోజకులు కావాలనే భ్రమలో మనం కూడా ఒక సంగతి మర్చిపోతున్నాం.... హాస్టల్ జీవితాలు మనపట్ల వాళ్లలో వాళ్లకే తెలీని ఒక కసిని పెంచుతున్నాయి... అదేంటో తెల్సా....

నువ్వు నన్ను చిన్ననాడు హాస్టల్‌లో దింపేస్తే...

పెద్దయ్యాక నిన్ను నేను ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పడేస్తాను. ఆనాడే ఆ పసిగుండెలు చేసే మౌన శపథాలు వినే శక్తి వుంటే... మనకీగతి పట్టి వుండేదికాదు... బాధపడకండి..." అని మరోసారి భుజం తట్టాడు.

నిజమే....

రాఘవయ్య చెవుల్లో ఆరేళ్ల వయసువాడు శైలేంద్ర "నాన్నా... హాస్టల్లో

నాకు భయమేస్తుంది. మనింటికెళ్లిపోదాం నాన్నా..." అన్న మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి.

కాని...

ప్రయోజకుడ్ని చెయ్యటమే పాపమని.... ఈనాటి యువతరం గుడ్డిగా భావిస్తే... ఈ శిక్షనైనా తీయగా అనుభవిద్దాం.... తల్లిదండ్రుల మనసంటే ఇంకా వెన్నముద్దలే అని నిరూపిద్దాం....

అనుకొని భారంగా మంచం మీద నడుం వాల్చాడు రాఘవయ్య. సరిగ్గా అదే సమయానికి....

శైలేంద్ర ఎక్కిన విమానం సుశృత ఓల్డ్ ఏజ్ హోమ్ బిల్డింగ్ పైనించి ఎగురుతూ వెళ్తోంది.

అందులో శైలేంద్ర... ఏదో బరువు దిగిపోయినట్టు నిట్టూర్చాడు!!

* * *